PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

ఆదివారం 04-10-2026 | పేజీలు : 8 | వెల రు : 2/- | సంపుటి : 2 సంచిక :124 | ప్రచురణ: సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## మనకు ఏఐ-ఆధారిత దళం ఉండాలి:

### ఐఏఎఫ్ చీఫ్ ఏపీ సింగ్



- సుఖోయ్ ఎస్‌యూ-57 అందించేందుకు రష్యా సిద్ధం.
- భారత్‌లోనే ఉమ్మడి ఉత్పత్తికి అవకాశం.
- భవిష్యత్ యుద్ధాలకు ఏఐ ఆధారిత దళం అవసరం.
- 114 రఫేల్ విమానాల ఒప్పందంపై చర్చలు.
- ఏటా 36--40 యుద్ధ విమానాలు అవసరం.
- సొంతంగా యుద్ధ విమాన ఇంజిన్ల తయారీ అవసరం.

2లో..



- స్మిత్ మచ్చర్ అబుధాబిలో చికిత్స.
- వేగంగా కోలుకుంటున్నారని భారత ఎంబసీ వెల్లడి.
- కుటుంబ సభ్యులు, అధికారులతో ఎంబసీ టచ్‌లో ఉంది.
- స్మిత్‌ను దుబాయ్ యువరాజు హమ్దాన్ పరామర్శించారు.

2లో..

## ‘మాకు గర్వకారణం’..

స్మిత్ మచ్చర్‌కు దుబాయ్ యువరాజు ఆత్మీయ ముద్దు

# ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

### సీఎం రేవంత్ రెడ్డి



రాష్ట్రంలో విద్య, వైద్యానికి సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. శనివారం సీఎంవో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆసుపత్రుల నిర్మాణం, పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఆసుపత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను గుర్తించి నియామక ప్రక్రియను మొదలు పెట్టాలని, ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది కొరత లేకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. ఆసుపత్రుల్లో అవసరమైన అత్యాధునిక పరికారాలను కొనుగోలు చేసి, ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యేనాటికి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, ఆసుపత్రులను సందర్శించాల్సిందేనని స్పష్టం చేశారు. సంబంధిత జిల్లాకు సంబంధించి జిల్లా స్థాయిలో ప్రతీ వారం వీటిపై సమీక్ష నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలల్లో అవసరమైన చోట మరమ్మతు పనులను చేపట్టాలని తెలిపారు. డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపైనా సమావేశంలో అధికారులతో చర్చించారు.

పేజి 2లో ▶

## ‘బొల్లారం’ కేసు..

దోపిడీలు చేసేందుకే ఆయుధాల చోరీ:

### సీపీ సుమతి



బొల్లారం ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో 7 మంది అరెస్టు.
ప్రధాన నిందితుడు మల్లేశ్ వివరాలతో దర్యాప్తులో పురోగతి.
అరెస్టైన వారిలో ముగ్గురు ఆర్మీ సిబ్బంది.
కేసులో ఉగ్ర లింకులు లేవు: పోలీసులు.
ఆయుధాలతో బెదిరించి దోపిడీలకు కుట్ర.
బ్యాంకులు, జ్యువెలరీ షాపులను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడి.

2లో..

## గౌరవెల్లి భూసేకరణ, పునరావాస సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

-నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



రాష్ట్ర సచివాలయంలో శనివారం గౌరవెల్లి ప్రాజెక్టుపై నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూసేకరణ, పునరావాస ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. భూసేకరణకు అవసరమైన నిధులు ఇప్పటికే సంబంధిత జిల్లాల కలెక్టర్లకు చేరాయని మంత్రి తెలిపారు.

పేజి 2లో ▶

## నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

-వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



2లో..

## పాకిస్థాన్ పై టీమ్ ఇండియా విజయం పట్ల సీఎం రేవంత్ రెడ్డి హర్షం




ఆసియా క్రీడల్లో పాకిస్థాన్‌పై భారత్ విజయం.
పురుషుల క్రికెట్‌లో టీమ్ ఇండియాకు స్వర్ణ పతకం.
జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు సీఎం

2లో..

## కామన్ పాస్‌తో సులభ ప్రయాణం

మెట్రో, ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



- ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యం.. మెట్రో--ఆర్టీసీ అనుసంధానానికి శ్రీకారం
- ప్రయాణికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి

హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మెట్రో రైలు, టీజీఎస్‌ఆర్టీసీ బస్సు సేవలను అనుసంధానం చేస్తూ ప్రవేశపెట్టిన ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్ ద్వారా ప్రయాణికులకు ఒకే పాస్‌తో మరింత సులభంగా గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం కల్పించింది. ఈ సౌకర్యం అమలు తీరును స్వయంగా పరిశీలించేందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మెట్రో రైలు, ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గణేష్, నవీన్ యాదవ్, అధికారులు కామన్ పాస్‌తో మెట్రోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పలువురు ప్రయాణికులతో నేరుగా మాట్లాడి కామన్ పాస్ వినియోగం ఎలా ఉంది? మెట్రో నుంచి బస్సుకు మారే సమయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా?

పేజి 2లో ▶

PRGI - TGTEL/25/A0348 జాతీయ తెలుగు దినపత్రిక Published by తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్
సందేశం టైమ్స్
నిజం దారుడు - నారి దారుడు



# సంపాదకీయం

## ‘ప్రభుత్వ వ్యతిరేకత’కు బీజేపీ అతీతమా?

రాహుల్‌గాంధీ ఇటీవల ఒక ప్రశ్న అడిగారు. రాజకీయ వర్గాలలో కలకలం సృష్టించిన ఆ ప్రశ్న సులభంగా ఉన్నట్టు కనిపిస్తున్నా నిజానికి సంక్లిష్టమైనది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, భారతీయ జనతా పార్టీ ఒక దశాబ్దానికి పైగా అధికారంలో ఉన్నప్పటికీ ప్రభుత్వ వ్యతిరేకత ప్రభావానికి ఎందుకు గురికావడం లేదు? 1977లో ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉన్న కారణంగా మా నానమ్మ ఇందిర సైతం ఓడిపోయారు అని ఆయన అన్నారు. మోదీ నేతృత్వంలోని బీజేపీ అధికారంలో కొనసాగేలా ఎన్నికల ప్రక్రియను తారుమారు చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు.

ఇది చాలా తీవ్రమైన ఆరోపణ. ఎన్నికల్లో జయాపజయాల విషయమై రాహుల్ ఇటీవల చేసిన వివిధ వ్యాఖ్యలలో మాదిరిగానే తాజా ఆరోపణలో కూడా ఒక ఇబ్బందికరమైన సత్యం ఉంది. ఒక విషయంలో రాహుల్ సరిగానే మాట్లాడారు. ఎన్నికల సంఘం తీవ్ర విశ్వసనీయత లోటును ఎదుర్కొంటోంది. అవును, ఈ సత్యం ఇంకెంత మాత్రం ఒక చర్చనీయాంశంగా ప్రతిపక్షాలకే పరిమితమై లేదు. ఈసీఐపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారనడం సత్యదూరం కాదు. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై వివాదం, పశ్చిమ బెంగాల్‌లో ఓటర్లు నివేదించిన వివరాలలో ‘తార్కిక వ్యత్యాసం’కు సంబంధించిన సమస్యలు, లక్షలాది ఓటర్ల తొలగింపుపై రగడ, ఓటర్ల అప్పీళ్లపై విచారణలో జాప్యం మొదలైనవన్నీ ఎన్నికల సంఘం పారదర్శకతపై న్యాయబద్ధమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. రాజ్యాంగ సంస్థల మధ్య ‘విశ్వాస లోటు’ ఉన్నదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించిందంటే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

ఓటర్ జాబితాల ధర్మబద్ధత గురించి పట్టించుకునే ఎవరికైనా ఈ అంకెలు ఆందోళన కలిగిస్తాయి. బెంగాల్‌లో ఇంతవరకు 22 లక్షల మంది పౌరులు తమ ఓటు హక్కు తొలగింపుపై అప్పీల్ చేశారు. విచారణ పూర్తయిన అప్పీళ్లలో 93శాతం మంది చట్టబద్ధమైన ఓటర్లే అని నిర్ధారణ అయింది. ఎన్నికలు అంటే కేవలం పోలింగ్ రోజున జరిగే ప్రక్రియ మాత్రమే కాదు. ఓటర్ జాబితాలలో ఎవరికి చోటు దక్కుతుందనే అంశంతోనే నిజానికి ఎన్నికలు ప్రారంభమవుతాయి. మరి తన పనితీరుపై ఆందోళనలను కేవలం రాజకీయ ఆరోపణలు మాత్రమేనని ఎన్నికల సంఘం ఎలా కొట్టివేయగలుగుతుంది? ఎన్నికల సంఘం తటస్థ మధ్యవర్తిగా వ్యవహరించడం లేదనే ఆందోళనలు ఇటీవల వివిధ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించిన తీరుతెన్నుల ఆధారంగానే వ్యక్తమవుతున్నాయన్నది నిరాకరించలేని వాస్తవం.

మన దేశంలో ఒపీనియన్ పోల్స్ నిర్వహించే ఏజెన్సీలు కూడా రాజకీయ కుట్రల్లో భాగమా? 2014 నుంచి నరేంద్ర మోదీకి ప్రజాదరణ-- ముఖ్యంగా హిందీ భాషా రాష్ట్రాలలోను, పశ్చిమ భారత రాష్ట్రాలలోనూ అంతకంతకూ పెరుగుతోందని అన్ని ఒపీనియన్ పోల్స్ ఫలితాలు నిర్ధారిస్తూనే ఉన్నాయి. ఆ పోల్స్ అన్నీ ప్రామాణిక పద్ధతులలో జరిగి ఉండకపోవచ్చు. అయినంతమాత్రాన వాటి ఫలితాలకు కారణమైన రాజకీయ పరిణామాన్ని కొట్టివేయడం సబబు కాదు. దానిని నిష్పాక్షికంగా అర్థం చేసుకోవాలి. కాంగ్రెస్ పార్టీకి అసాధ్యంగా ఉన్న మహా శక్తిమంతమైన రాజకీయ, సంస్థాగత యంత్రాంగాన్ని బీజేపీ అభివృద్ధిపరచుకున్నది. కార్యకర్తల బలాన్ని అపారంగా పెంచుకున్నది. పైగా ఆరెస్సెస్ నుంచి సంపూర్ణ మద్దతు బీజేపీకి లభిస్తోంది. ఆర్థిక వనరులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి. పార్టీ సందేశాలను ప్రభావదాయకంగా ప్రజలలోకి తీసుకువెళ్లే సామర్థ్యం తక్కువేమీ కాదు. కనుకనే జాతీయ ప్రాధాన్యమున్న అంశాలను ఎన్నికల ప్రచారానికి చాలా నేర్పుగా, ప్రయోజనకరంగా ఉపయోగించుకోవడంలో బీజేపీ సదా సఫలమవుతోంది.

ఎన్నికల వ్యయాలపై ఈసీఐకి నివేదించిన వివరాల ప్రకారం, ఈ ఏడాది ఐదు రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ మొత్తం రూ.529.38 కోట్లు ఖర్చు చేసింది. ఆ ఐదు రాష్ట్రాలలో కాంగ్రెస్ చేసిన వ్యయం రూ. 248.55 కోట్లు. బీజేపీ ఒక్క బెంగాల్‌లోనే చేసిన వ్యయం, ఐదు రాష్ట్రాలలో కాంగ్రెస్ ఖర్చు చేసిన మొత్తం కంటే ఎక్కువగా ఉన్నది. ఈసీఐ వెల్లడించిన లెక్కల ప్రకారం, బెంగాల్‌లో బీజేపీ ఎన్నికల వ్యయం రూ.286.99 కోట్లుగా ఉన్నది. ఆయా పార్టీలు చేసిన వ్యయాలు ఇంకా అధికంగా ఉంటాయనడంలో సందేహం లేదు. అయితే అవేవీ ఎన్నికలలో అక్రమాలు జరిగాయన్న విషయాన్ని రుజువు చేయలేవు. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల కాలంలోనే తమకు అందిన విరాళాలు మొత్తం రూ.1,473 కోట్లు అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యాలయం వెల్లడించింది. అదే కాలంలో కాంగ్రెస్‌కు విరాళాల రూపేణా కేవలం రూ.207 కోట్లు మాత్రమే సమకూరాయి. చెప్పవచ్చినదేమిటంటే ఒక శక్తిమంతమైన ఎన్నికల యంత్రాంగం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవడానికి ఎలాంటి కుట్ర సిద్ధాంతాలు అవసరం లేదు. గతంలో దశాబ్దాలుగా అధికారంలో ఉన్న ప్రధాన ప్రతిపక్షం అధికార పార్టీతో సమానంగా సమర్థ యంత్రాంగాన్ని ఎందుకు నిర్మించుకోలేకపోయింది? ఈ ప్రశ్నను రాహుల్‌గాంధీ ఎదుర్కోవాలి.

కాంగ్రెస్‌కు వాటిల్లిన సమస్యలన్నిటికీ ఈసీఐని తప్పుపట్టడం ఎంతమాత్రం వివేకం కాదు. నాయకత్వ తగాదాలు, సంస్థాగత క్షీణత, ముఠాల కుమ్ములాటలు, ఫిరాయింపులు, బలహీనపడిన పీసీసీలు మొదలైనవన్నీ కాంగ్రెస్ స్వయంకృతాలే కానీ ఈసీఐ ప్రమేయంతో జరిగినవి కావు కదా. ఇదిగో ఇక్కడే ప్రభుత్వ వ్యతిరేకత అనే వాదన మరింత ఆసక్తికరమవుతోంది. ఎందుకంటే ప్రభుత్వ వ్యతిరేకత అనేది ఉంది. అదొక వాస్తవం. 2018లో మూడు హిందీ రాష్ట్రాలలో బీజేపీని కాంగ్రెస్ ఓడించింది. 2023లో కర్ణాటకలో బీజేపీ అధికారాన్ని కోల్పోయింది. 2024 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ కనీస మెజారిటీని కూడా సాధించుకోలేకపోయింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మిత్రపక్షాలపై ఆధారపడడం అనివార్యమయింది. భారతీయ ఓటర్లు అధికారంలో ఉన్నవారిని శిక్షిస్తారని, శిక్షించగలరని ఈ జయాపజయాలు స్పష్టం చేస్తున్నాయి. మోదీపై ప్రభుత్వ వ్యతిరేకత ఎందుకు పనిచేయడం లేదు? ప్రతిపక్షాలు ప్రభుత్వ వ్యతిరేకతను ఒక సుస్థిర జాతీయ ప్రత్యామ్నాయంగా ఎందుకు మార్చలేకపోతున్నాయి? మొదటిదానికంటే రెండోదే మరింత ఆసక్తికరమైన ప్రశ్న. ఈ రెండు ప్రశ్నల మధ్య ఉన్న తేడా చాలా ముఖ్యమైనది. బీజేపీని ఎన్నికల్లో ఓడించడం అసాధ్యం కావచ్చు కానీ ప్రతిపక్షాలు ఆ పార్టీని రాజకీయంగా ఎందుకు ఎదుర్కోలేకపోతున్నాయి, సులభంగా ఎందుకు ఓడిపోతున్నాయని కాంగ్రెస్ తప్పక ప్రశ్నించుకోవాలి. నైరాశ్యానికి లోనవుతూ దాన్ని అధిగమించడానికి ప్రయత్నించకపోతే ఎలా? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పన్నెండేళ్లకు పైగా దేశాన్ని పరిపాలిస్తున్నారు. రాజకీయ అలసట, అసంతృప్తి, బలహీనతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రతిపక్షాలకు ఇదొక రాజకీయ అవకాశం. అయితే రాజకీయ అవకాశమే రాజకీయ విజయానికి రాచబాట వేయదు. ప్రభుత్వ వ్యతిరేకత అయితే ఉన్నది. దానిని ఓట్లు, సీట్లుగా మార్చడానికి ఒక సువ్యవస్థిత రాజకీయ వేదిక అవసరం.

మళ్లీ రాహుల్‌గాంధీ వద్దకు వెళదాం. తన ప్రశ్నలకు ఈసీఐ సమాధానాలు చెప్పాలని ఆయన డిమాండ్ చేయడం సమంజసమే. ఎన్నికల సంఘానికి, ఆ మాటకు వస్తే ఏ రాజ్యాంగ సంస్థకు అయినా పారదర్శకత, జవాబుదారీతనం, సంస్థాగత విశ్వసనీయత ఉండడం అవసరం. ఓటర్ల జాబితాపై రగులుతున్న వివాదం స్పష్టం చేస్తున్నదేమిటి? ఈసీఐ తన విధులను మరింత పారదర్శకతతో నిర్వహించాలనే కాదూ? సర్ ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని సంపూర్ణంగా వెల్లడించాలి. దానిని స్వతంత్ర వ్యక్తులు, సంస్థలు పరిశీలించి నిగ్గు తేల్చాలి. ఇది తప్పనిసరి. ఈసీఐ ప్రమేయం కీలకంగా లేని ప్రాంతాలలో కాంగ్రెస్ పరాజయం పాలయింది. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కాంగ్రెస్‌కు ఘనమైన ఎన్నికల విజయాలు లభించాయి. ఎన్నికల మధ్యవర్తి-- అంటే ఈసీఐ తన విధులు సక్రమంగా నిర్వర్తించనందునే బీజేపీ అసాధారణ విజయాలు మూటగట్టుకుందని విమర్శించడం సబబుకాదు. ఈసీఐ కంటే బాగా సహాయకారి అయిన రాజకీయ, సంస్థాగత, సైద్ధాంతిక, నాయకత్వ కారణాలు బీజేపీ విజయాల వెనుక ఉన్నాయి. ఈ వాస్తవాన్ని విపక్షాలు విస్మరించకూడదు.

కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాలను చక్కదిద్దడంపై రాహుల్‌గాంధీ తన దృష్టిని కేంద్రీకరించాలి. అలా కాకుండా బాహ్య సమస్యలపై ఆయన ఎంత ఎక్కువగా దృష్టి పెడితే, తన అంతర్గత లోపాలను సరిదిద్దుకోవడంలో కాంగ్రెస్‌పై అంత తక్కువ ఒత్తిడి ఉంటుంది. దీనివల్ల వాటిల్లే ప్రమాదాన్ని రాహుల్ గుర్తించాలి. ఎన్నికల ప్రక్రియ సమగ్రతను రక్షించేందుకు కృషి చేస్తూనే తన సంస్థాగత లోపాలను సరిదిద్దుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నించాలి. ఈ రెండిటినీ ఏకకాలంలో నిర్వర్తించడం నిజంగా ఒక పెద్ద సవాలు. రెండూ అవసరమే. ఏదో ఒకటి మాత్రమే సరిపోదు.

## నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో నూనెగింజలు, పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం, ఉత్పత్తిని పెంచడంతో పాటు రైతులకు నాణ్యమైన ధృవీకరించిన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం సచివాలయంలో శ్రీ రైతు నేస్తం కార్యక్రమంలో రబీ 2026-27 నూనెగింజలు, పప్పుధాన్యాల విత్తన పంపిణీని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జాతీయ తినదగిన నూనెలు-- నూనెగింజల మిషన్ (చీవీజూ-ూూ) కింద రబీ 2026-27లో 29,375 క్వింటాళ్ల నూనెగింజల విత్తనాలను 52,425 ఎకరాల్లో పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకోసం రూ.36.76 కోట్ల సబ్సిడీ అందించనున్నారు. వేరుశనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, నువ్వుల పంటలకు ధృవీకరించిన విత్తనాలను రైతులకు అందించనున్నారు.

నూనెగింజల సాగులో ఆధునిక పద్ధతులను ప్రోత్సహించేందుకు 1,200 ఎకరాల్లో బ్లాక్ స్థాయి ప్రదర్శనలు నిర్వహించనున్నారు. వీటి ద్వారా రైతులకు మెరుగైన సాగు పద్ధతులు, అధిక దిగుబడుల సాధనపై అవగాహన కల్పించనున్నారు.

పప్పుధాన్యాల్లో ఆత్మనిర్భరత మిషన్ (పీూచీ) కింద రబీ 2026-27లో 29,008 క్వింటాళ్ల పప్పుధాన్యాల విత్తనాలను సుమారు 1.09 లక్షల ఎకరాలకు పంపిణీ చేయాలని ప్రణాళిక రూపొందించారు. శనగ, మినుము, పెసర పంటలకు సబ్సిడీపై విత్తనాలను అందించనున్నట్లు మంత్రి తెలిపారు. నూనెగింజలు, పప్పుధాన్యాల దేశీయ ఉత్పత్తిని పెంచడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడం ద్వారా దేశంలో ఆత్మనిర్భరత సాధించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలను సకాలంలో అందుబాటులోకి తీసుకురావడం, సాగు ఉత్పాదకతను పెంచడం, రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా వ్యవసాయ శాఖ సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు.

## పాకిస్థాన్ పై టీమ్ ఇండియా విజయం పట్ల సీఎం రేవంత్ రెడ్డి హర్షం

మొదటి పేజీ తరువాయి

జపాన్లో జరుగుతున్న 2026 ఆసియా క్రీడల్లో పురుషుల క్రికెట్ ఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్పై అద్భుత విజయం సాధించిన టీమ్ ఇండియాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ స్వర్ణ పతకం దేశానికి అపారమైన గౌరవాన్ని, కీర్తిని తీసుకువచ్చి, అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత క్రీడా విజయాల చరిత్రలో మరో చిరస్మరణీయ అధ్యాయంగా మిగులుతుందని పేర్కొంటూ టీమ్ ఇండియా జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్కు అభినందనలు తెలిపారు. అభిషేక్ శర్మ అద్భుతంగా సాధించిన 61 పరుగుల ఇన్నింగ్స్కు, తెలంగాణ స్టార్ క్రికెటర్ తిలక్ వర్మ అజేయంగా చేసిన 51 పరుగులకు, అలాగే కీలకమైన ప్రారంభ వికెట్లు తీసిన అక్షర్ పటేల్ల క్రీడాస్ఫూర్తిని ముఖ్యమంత్రి ప్రశంసించారు. ఆసియా క్రీడల్లో వివిధ క్రీడాల్లో పట్టుదల, అంకితభావం, క్రీడాస్ఫూర్తితో పోటీపడి పతకాలు సాధించి, అంతర్జాతీయ క్రీడా రంగంలో భారత ప్రతిష్ఠను మరింత పెంచిన భారతీయ క్రీడాకారులందరికీ ముఖ్యమంత్రి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

## కామన్ పాస్‌తో సులభ ప్రయాణం

మొదటి పేజీ తరువాయి

ప్రయాణం సులభమైందా? వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రయాణికుల నుంచి సానుకూల స్పందన

?కామన్ పాస్ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పలువురు ప్రయాణికులు భట్టికి తెలిపారు. మెట్రోలో ప్రయాణించిన అనంతరం గమ్యస్థానానికి చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల సమయం ఆదా అవుతోందని చెప్పారు. ప్రత్యేకంగా మరో టికెట్ తీసుకోవాల్సిన అవసరం లేకపోవడం సౌకర్యంగా ఉందన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత ఏ బస్సు ఎక్కాలి, ఏ మార్గంలో వెళ్లాలి అనే విషయంలో గతంలో ఎదురయ్యే అయోమయం కూడా తగ్గిందని ప్రయాణికులు వివరించారు. ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో--ఆర్టీసీ సేవలను అనుసంధానం చేయడం వల్ల రోజువారీ ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతోందని పేర్కొన్నారు.

### బస్సులోనూ ప్రయాణికులతో ముచ్చట

జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి భట్టి విక్రమార్క సహచర మంత్రులతో కలిసి టీజీఎస్‌ఆర్టీసీ బస్సులో సెక్రటేరియట్ వరకు ప్రయాణించారు. బస్సులోనూ ప్రయాణికులతో ముచ్చటిస్తూ కామన్ పాస్ వినియోగం, ప్రయాణ సౌకర్యం, మెట్రో--బస్సు అనుసంధానంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

### ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరం: భట్టి

ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్ విధానం ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఒకే పాస్‌తో మెట్రో, ఆర్టీసీ బస్సులను సమన్వయంతో వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు గమ్యస్థానానికి చేరుకునే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, అయోమయం తగ్గుతాయని తెలిపారు. మెట్రోలో ప్రయాణిస్తున్న మహిళలు, ఇతర ప్రయాణికులతో మాట్లాడగా కామన్ పాస్ విధానం సౌకర్యవంతంగా ఉందని వారు చెప్పారని భట్టి పేర్కొన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత తమ ఇల్లు, కార్యాలయం లేదా ఇతర గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల ప్రయాణం మరింత సులభతరం అవుతుందని అన్నారు. ప్రజా రవాణాలోని వివిధ మార్గాలను ఒకదానితో ఒకటి అనుసంధానం చేసి ప్రయాణికులకు ‘సీమ్‌లెస్’ ప్రయాణ అనుభూతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి తెలిపారు. ప్రస్తుతం మెట్రో--ఆర్టీసీ సేవలను అనుసంధానం చేశామని, భవిష్యత్తులో ఆటోలు, ఊబర్ వంటి ఇతర రవాణా సేవలను కూడా అనుసంధానం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని చెప్పారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు భట్టి కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రజా రవాణాను బలోపేతం చేస్తాం: పొన్నం

హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా మార్చే లక్ష్యంతో ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఒకే పాస్‌తో ఆర్టీసీ, మెట్రో సేవలను వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు సమయం, శ్రమతో పాటు ఖర్చు కూడా ఆదా అవుతుందని అన్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు ప్రజా రవాణాను బలోపేతం చేయడం ముఖ్యమైన పరిష్కారమని పేర్కొన్నారు. ప్రజలను వ్యక్తిగత వాహనాల నుంచి ప్రజా రవాణా వైపు ఆకర్షించాలంటే ఆర్టీసీ, మెట్రో సేవలను సమన్వయంతో, సౌకర్యవంతంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ప్రయాణ భారాన్ని తగ్గించేందుకు డైలీ పాస్, మంత్లీ పాస్‌తో పాటు కామన్ పాస్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.

ప్రయాణికుల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుని కామన్ పాస్ సేవలను మరింత మెరుగుపరుస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజలకు ఆర్థికంగా అందుబాటులో ఉండేలా మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హైదరాబాద్ భవిష్యత్తు అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల ప్రయాణ కష్టాలను తగ్గించడంలో ప్రజా రవాణా కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారు (అర్బన్ ట్రాన్స్‌పోర్ట్--మెట్రో) ఎన్.వి.ఎస్.రెడ్డి, మెట్రో ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, మెట్రో అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి.అజిత్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మనకు ఏఐ-ఆధారిత దళం ఉండాలి:

మొదటి పేజీ తరువాయి

భారత్‌కు ఐదోతరం అత్యాధునిక స్టెల్త్ యుద్ధ విమానం సుఖోయ్ ఎస్‌యూ-57 అందించేందుకు రష్యా సిద్ధంగా ఉందని భారత వైమానిక దళం చీఫ్ అమర్ ప్రీత్ సింగ్ఎ అన్నారు. వాటిని భారత్‌లోనే ఇరుదేశాలూ ఉమ్మడిగా ఉత్పత్తి చేసే అవకాశం కూడా ఉందని చెప్పారు. అయితే ఈ ప్రతిపాదనపై కేంద్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. భారత్‌కు ఉన్న మొత్తం సైనిక బలంలో వైమానిక శక్తి కీలకమైనదని, కృత్రిమ మేధ సాయంతో దానిని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఐఏఎఫ్‌ను ఆధునీకరించడం గురించి మాట్లాడుతూ.. భవిష్యత్ యుద్ధాలను ఎదుర్కొనేందుకు ఏఐ-ఆధారిత దళం ఉండాలని పేర్కొన్నారు.

అనుకున్న విధంగా జరిగితే.. త్వరలో ఫ్రాన్స్‌తో మల్టీ-రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ ఒప్పందాన్ని ఖరారు చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఐఏఎఫ్ చీఫ్ తెలిపారు. 114 రఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిపాదనకు భారత్ ఫిబ్రవరిలో ఆమోదం తెలిపిందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ధరలు, ఇతర కీలక అంశాలపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నట్లు చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారత వైమానిక దళానికి (ఐఏఎఫ్) ఏటా కనీసం 36-40 యుద్ధ విమానాలు అవసరమవుతాయని, ఇందుకోసం సొంతంగా యుద్ధ విమాన ఇంజిన్‌లను ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

## ‘మాకు గర్వకారణం’..

మొదటి పేజీ తరువాయి

హైదుబాయ్ విమాన ఘటనలో తీవ్రంగా గాయపడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్ ప్రస్తుతం యూఏఈలోని అబుధాబీలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆయన వేగంగా కోలుకుంటున్నారని యూఏఈలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. “భారత ధైర్యశాలి కెప్టెన్ స్మిత్ మెరుగైన వైద్య సంరక్షణలో ఉన్నారు. వేగంగా కోలుకుంటున్నారు. ఆయన కుటుంబ సభ్యులు, స్థానిక అధికారులతో టచ్‌లో ఉన్నాం. యూఏఈ ప్రభుత్వానికి ధన్యవాదాలు” అని భారత ఎంబసీ తెలిపింది.

మరోవైపు.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్‌ను యూఏఈ ఉప ప్రధాని, దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ అల్ మక్తూమ్ పరామర్శించారు. “ ప్రయాణికుల ప్రాణాల విషయంలో అత్యంత ధైర్యసాహసాలు కనబర్చిన పైలట్‌ను పరామర్శించాను. ఆయన మా బృందంలో, దేశ చరిత్రలో ఒక భాగం. యూఏఈ ఆశయాలకు ప్రతీకగా నిలవడం మాకు గర్వకారణం” అని ‘ఎక్స్’ వేదికగా పేర్కొన్నారు.

## ‘బొల్లారం’ కేసు.. దోపిడీలు చేసేందుకే ఆయుధాల చోరీ: సీపీ సుమతి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: బొల్లారం ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో పురోగతి లభించింది. ప్రధాన నిందితుడు మల్లేశ్ ఇచ్చిన వివరాలతో ఆయుధాల చోరీ కేసులో మొత్తం ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. శేషు, వినోద్, ప్రవీణ్, నిరంజన్, మల్లికార్జున్, బీర్బల్ షా, అవి దెయ్‌ను అరెస్టు చేశారు.

ఈ కేసుకు సంబంధించిన వివరాలను మల్కాజిగిరి సీపీ సుమతి వెల్లడించారు. ఏ2 శేషు, ఏ3 వినోద్, ఏ4 ప్రవీణ్ ఆర్మీలో పని చేస్తున్నట్లు గుర్తించామన్నారు. “ఆర్మీ ఆయుధాల కేసులో ఉగ్ర లింకులు లేవని తేలింది. ఆయుధాలతో బెదిరించి చోరీలు చేసే ఉద్దేశంతోనే కుట్ర జరిగింది. ఇక్కడి నుంచి తీసుకెళ్లిన ఆయుధాలను.. బ్యాంకులు, జ్యువెలరీ షాపుల్లో చోరీలకు వాడాలనుకున్నారు. ధనవంతులను బెదిరించి దోపిడీ చేయాలని నిందితులు కుట్ర చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఆయుధాలు కొనుగోలు చేసేందుకు పశ్చిమ బెంగాల్‌కు చెందిన బీర్బల్ షా, అవి దెయ్.. వీరిని సంప్రదించారు. పిస్టల్‌కు రూ.3లక్షలు, లాంగ్ వెపన్‌కు రూ.5 లక్షల చొప్పున ఒప్పందం జరిగింది” అని సీపీ వివరించారు.

## ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

మొదటి పేజీ తరువాయి

సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడుల విషయంలో పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. త్వరలోనే ఏర్పాట్లను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గౌరవెల్లి భూసేకరణ, పునరావాస సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

మొదటి పేజీ తరువాయి

భూసేకరణ, పునరావాస ప్రక్రియ వేగవంతానికి సత్వరం చర్యలు చేపట్టాలని సూచించారు. సిద్దిపేట, హనుమకొండ, కరీంనగర్ జిల్లాల భూసేకరణ వివరాలు, పెండింగ్ అంశాలపై చర్చించారు. గౌరవెల్లి నిర్వాసితుల పునరావాస సమస్యలపై సంబంధిత అధికారులు, ఉన్నతాధికారులతో సమగ్రంగా చర్చించారు.

అటవీ నోటిఫికేషన్ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే నా దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎడమ, కుడి కాలువల అంచనాలు, ప్రతిపాదనలపై చర్చించారు.

పంపిణీ కాలువల టెండర్ ప్రతిపాదనల స్థితిపై పరిశీలించారు. ప్రాజెక్టులో నీటి నింపుదల, విడుదల నివేదికలపై సమావేశంలో చర్చించారు. పర్యావరణ అనుమతులు, ఎన్‌జీటీ కేసుకు సంబంధించిన అంశాలపై ఎంఎంఆర్ ప్యాకేజీ--3 ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ లోకసభ సభ్యులు బలరాం నాయక్

సమీక్షలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్, భూసేకరణ--పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు, ఈఎన్‌సీ జనరల్ రమేష్ బాబు,ఇ. ఎన్ సి ఓడయం మధుసూదన్ రావు జాయింట్ సెక్రటరీ కే. శ్రీనివాస్ తదితరులు, పాల్గొన్నారు.

## ఎవరి ఓట్లు ఉంచాలనేదానిపై భాజపా కార్యాలయం నుంచి లిస్ట్: ప్రకాశ్‌రాజ్



హైదరాబాద్: ఓటర్ల జాబితాలో ఎవరి ఓట్లు ఉంచాలనేదానిపై భాజపా కార్యాలయం నుంచి లిస్ట్ వెళ్తోందని సినీనటుడు ప్రకాశ్‌రాజ్ (ూతీఖఝంప్ర ఝుయ) ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ‘సర్’పై విమర్శలు చేశారు. “బతికుండగానే ఓట్లు తొలగించారని కొందరు చెబుతున్నారు. ఎవరి ఓట్లు ఉంచాలన్నది భాజపా కార్యాలయం నుంచి లిస్ట్ వెళ్తోంది. ఆ పార్టీ అనుకూల ఓట్లు మాత్రమే ఉంటున్నాయి. అక్రమ చొరబాటుదారులుంటే ఇన్నేళ్లుగా ఏం చేశారు? కేంద్రహోంశాఖ ఏం చర్యలు తీసుకుంది?” అని ప్రకాశ్‌రాజ్ ప్రశ్నించారు.

# కాంగ్రెస్ పార్టీకి మా కుటుంబం నాలుగు తరాలుగా విధేయులం

**అర్వపల్లి, అక్టోబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి సోమయ్య కంభంపాటి):**
కాంగ్రెస్ పార్టీకి తమ కుటుంబం నాలుగు తరాలుగా విధేయంగా ఉందని, అసత్య ప్రచారాలకు తావులేదని, కాంగ్రెస్ పార్టీ అంతా ఒక్కటై తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిందని నల్లగొండ--ఖమ్మం--వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తెలిపారు. అర్వపల్లి శ్రీ యోగనందా లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో స్వామివారిని దర్శించుకుని ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలతో తమ కుటుంబానికి సుదీర్ఘ అనుబంధం ఉందని, తనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, తన అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తన అభ్యర్థిత్వంపై ఎలాంటి గందరగోళం, అసంతృప్తి లేదని, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని తమ కుటుంబం ఎప్పుడూ ధిక్కరించలేదని స్పష్టం చేశారు. తనకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం రావడంలో దేవుడి ఆశీస్సులతో పాటు తన తండ్రి, దివంగత మాజీ మంత్రి 'టైగర్ దామన్న' రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఆశీస్సులు ఉన్నాయని, దామోదర్ రెడ్డి ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించిన తాను కెనడా, అమెరికాల్లో ఆసియా ఖండంలోనే అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటైన సంస్థలో ఉన్నత స్థాయిలో పనిచేసిన అనుభవం ఉందన్నారు. తన తండ్రి కోరిక మేరకు రాజకీయాల్లోకి వచ్చి 2012 నుంచి కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేస్తున్నానని తెలిపారు. 2014, 2019 ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని పార్టీ అధిష్టానాన్ని కోరిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం అమెరికా నుంచి తిరిగి వచ్చి రైతుగా వ్యవసాయంతో పాటు డైరీ, చేపల పెంపకం రంగాల్లో కొనసాగుతున్నానని, రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్నానని తెలిపారు. అన్ని పార్టీల కంటే ముందుగానే కాంగ్రెస్ పార్టీ తనను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిందని, అర్హత కలిగిన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు. పట్టభద్రులకు



ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు గ్రామగ్రామాన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ హెల్ప్‌లైన్‌ను ప్రారంభిస్తామని వెల్లడించారు. తమ ఇంటి ఇలవేల్పు అయిన శ్రీ యోగనందా లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులతో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. దేవస్థానం అభివృద్ధి కోసం తమ కుటుంబం తరఫున 850 ఎకరాల భూమిని దానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీకి తమ కుటుంబం విధేయంగా ఉందని, పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ పట్టభద్రుల సమస్యలను ప్రజల తరఫున బలంగా వినిపించేందుకు కృషి చేస్తానని రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తెలిపారు.

# ధూళిమిట్ట ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా వేణుగోపాల్ గౌడ్ ఎన్నిక

**సిద్దిపేట సందేశం టైమ్స్ ప్రతినిధి అక్టోబర్ 4**



సిద్దిపేట జిల్లా, ధూళిమిట్ట మండల కేంద్రంలో శనివారం ఉపసర్పంచుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కూటిగల్ గ్రామం ఉపసర్పంచ్ గెల్లపల్లి వేణుగోపాల్ గౌడ్ ను 9 మంది ఉపసర్పంచుల మద్దతుతో ధూళిమిట్ట మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల ఉపసర్పంచులు కూడా పాల్గొన్నారు.

# పోడు భూములకు పట్టాలు ఇప్పించాలని ఎమ్మెల్యేకి వినతి

**సిద్దిపేట సందేశం టైమ్స్ ప్రతినిధి అక్టోబర్ 4 సిద్దిపేట జిల్లా**



కల్హేర్ మండలంలోని కృష్ణాపూర్ గ్రామ రైతులు మార్డి శివారులోని 115 సర్వే నంబర్లు గల పోడు భూములకు హక్కు పత్రాలు (పట్టాలు) పంపిణీ చేయాలని, పట్టాలు లేక రైతు భరోసా, పండించిన ధాన్యం అమ్ముకోవడానికి ఇబ్బంది జరుగుతుందని, రైతులు ఎమ్మెల్యే సంజీవరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు.

# పోలీస్ స్టేషన్ పరిధిల పునర్వ్యవస్థీకరణ

**పటాన్‌చెరు, అక్టోబర్ 4(సందేశం టైమ్స్ ప్రతినిధి బి. డేవిడ్):**
పోలీస్‌స్టేషన్ల ప్రాదేశిక పరిధుల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రభుత్వం జారీ చేసిన జీ.ఓ.ఎం.ఎస్. నం. 85, 88 ప్రకారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి పలు గ్రామాలు, కాలనీలు కొత్తగా చేర్చినట్లు పటాన్‌చెరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం. రవీందర్ తెలిపారు. ఇస్నాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇస్నాపూర్, చిట్కుల్, చిన్న కంజర్ల, ఇంద్రేశం, లక్డారం, పెద్ద కంజర్ల, రుద్రారం, రామేశ్వరం బండ, బచ్చుగూడెం, ఇనోల్, ములుగోయి గ్రామాలు చేర్చబడ్డాయని, సీఎంసీ పరిధిలోని ముత్తంగి వార్డుకు చెందిన ఘన్‌పూర్,




వెనుముకుంట, కర్దనూర్, పాటి, వెలిమెల, వెలిమెల తండా, సందుగూడెం గ్రామాలు ఇంతకుముందు బీడీఎల్ భానూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండగా ఇకపై పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే ఆర్‌సీ పురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న బండ్లగూడ, మార్బ్ నగర్, భోపాల్ రెడ్డి నగర్, నేతాజీ నగర్, బాలాజీ నగర్ కాలనీలు కూడా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి చేర్చినట్లు తెలిపారు. అక్టోబర్ 2, 2026 నుంచి ఆయా గ్రామాలు, కాలనీలలో శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తు, పెట్రోలింగ్, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు తదితర అన్ని పోలీసు సేవలను పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ నిర్వహిస్తుందని ఇన్‌స్పెక్టర్ ఎం. రవీందర్ వెల్లడించారు. ఆయా గ్రామాలు, కాలనీల ప్రజలు ఇకపై పోలీసు సేవలు, ఫిర్యాదులు, ఇతర పోలీసు సంబంధిత అవసరాల కోసం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

# తల్లిని వేధించి, ఇంటికి నిప్పు పెట్టిన కొడుకు అరెస్ట్

**మెదక్ సందేశం టైమ్స్ ప్రతినిధి అక్టోబర్ 4**



మెదక్ జిల్లా, నిజాంపేట మండలం నస్కల్‌లో కొత్త కారు కోసం డబ్బులు ఇవ్వాలని తల్లి రజినిని వేధించి, ఆమె నిరాకరించడంతో దూషించి, దాడి చేసి చంపుతానని బెదిరించి, చివరికి ఇంటికే నిప్పంటించిన గౌతమ్‌రెడ్డిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. మధ్యాహ్నం మద్యం సేవించి తల్లితో గొడవపడటంతో భయపడిన రజిని స్నేహితురాలి ఇంటికి వెళ్లగా అదే రాత్రి 11.30 గంటలకు గౌతమ్‌రెడ్డి ఇంటికి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. రజిని ఫిర్యాదు మేరకు పోలీసులు గౌతమ్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు

# జహీరాబాద్ బస్‌స్టాండ్‌లో మదర్ బేబీ బ్రెస్ట్‌ఫీడింగ్ క్యాబిన్ ప్రారంభం

**జహీరాబాద్, అక్టోబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి)**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో తల్లులు తమ శిశువులకు ప్రశాంతమైన, సురక్షితమైన వాతావరణంలో తల్లిపాలు అందించేందుకు జహీరాబాద్ బస్‌స్టాండ్‌లో ఏర్పాటు చేసిన మదర్ బేబీ బ్రెస్ట్‌ఫీడింగ్ క్యాబిన్‌ను జిల్లా సంక్షేమ అధికారి లలితా కుమారి, మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శిశువులకు తల్లిపాలు అందించడం వల్ల కలిగే ప్రయోజనాలు, శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలలో తల్లిపాల ప్రాధాన్యతపై తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం రచ్చన్నపేటలోని గౌరీ ప్యాలెస్‌లో పోషణ్ మాహ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి లలితా కుమారి ముఖ్య అతిథిగా హాజరై గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమతుల్యమైన పోషకాహారం అందించడం అత్యంత కీలకమని తెలిపారు. ముఖ్యంగా శిశువు జీవితంలోని తొలి 1,000 రోజులు ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది వేస్తాయని, ఈ కాలంలో తల్లి, బిడ్డకు సరైన పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ అందించాల్సిన అవసరం






ఉందని వివరించారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు, చిరుధాన్యాలు, ఇతర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల స్థానిక పోషకాహార పదార్థాలతో ప్రత్యేక ఆహార ప్రదర్శన ఏర్పాటు చేసి వాటిలోని పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. "పోషకాహారం--ఆరోగ్యకరమైన కుటుంబం--ఆరోగ్యకరమైన సమాజం" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో పోషణ్ మాహ్ సందర్భంగా జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సుశీల, జహీరాబాద్ ఎంఆర్‌ఓ దశరథ్, జిల్లా కోఆర్డినేటర్ పల్లవి, జహీరాబాద్ సెక్టార్ సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ సిబ్బంది, బ్లాక్ కోఆర్డినేటర్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

**కల్హేర్, అక్టోబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**



కల్హేర్ మండల కేంద్రానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ర్యాకల నరసింహ గౌడ్ సోదరుడు ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పడంతో పాటు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని భూపాల్ రెడ్డి సూచించారు. ఆయన వెంట మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు గాని, మాజీ సర్పంచ్ బాలయ్య, ఉపసర్పంచ్ సాయిలు, నాయకులు హనుమంతు రావు, పండరి, విఠల్, ప్రభు గౌడ్, నరసింహ గౌడ్, సత్య గౌడ్ తదితరులు ఉన్నారు.

# ఆరు నెలలు రేషన్ తీసుకోని కార్డులు నిలిపివేతకు చర్యలు

మెదక్, అక్టోబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి):



వరుసగా ఆరు నెలల పాటు రేషన్ తీసుకోని కార్డులను తాత్కాలికంగా నిలిపివేసే చర్యలకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. అక్టోబర్ నుంచి దేశవ్యాప్తంగా సుమారు 1.58 కోట్ల రేషన్ కార్డులను తాత్కాలికంగా నిలిపివేసే అవకాశం ఉందని తెలుస్తోంది. రేషన్ కార్డులలో మరణించిన వ్యక్తుల పేర్లు, డూప్లికేట్ కార్డులు, నకిలీ పేర్లను గుర్తించి తొలగించే ప్రక్రియలో భాగంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. అయితే ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకున్న అనంతరం అర్హత ఉన్న కార్డులను తిరిగి యాక్టివేట్ చేసే అవకాశం ఉంది. రేషన్ కార్డుదారులు మేరా రేషన్ యాప్ లేదా సమీప మీ సేవా కేంద్రాల ద్వారా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

# రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యత

సంగారెడ్డి, అక్టోబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి)

సంగారెడ్డి జిల్లా లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం, పౌష్టికాహారం, సురక్షితమైన తాగునీరు, అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు, మరమ్మతుల అవసరాలు, విద్యార్థుల భద్రత తదితర అంశాలపై సంబంధిత అధికారులు, జిల్లా కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాళ్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా ప్రిన్సిపాళ్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, ఆహారం తయారీ, నిల్వ, పంపిణీలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. వసతి గృహాల్లో తగిన గాలి, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రతి గదిలో అవసరమైన ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీటి సదుపాయాలు సక్రమంగా ఉండేలా చూడాలని తెలిపారు. ముఖ్యంగా బాలికల వసతి గృహాల్లో మరుగుదొడ్లు, స్నానపు గదులు, తలుపులు, రన్నింగ్ వాటర్ తదితర సదుపాయాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అవసరమైన పనులకు సంబంధించి పూర్తి వివరాలతో అంచనా ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని ప్రిన్సిపాళ్లు, జిల్లా కోఆర్డినేటర్లను ఆదేశించారు. విద్యార్థులు రాత్రి వేళల్లో కూడా సురక్షితంగా




సంచరించేలా రెసిడెన్షియల్ పాఠశాలల క్యాంపస్ పరిసరాల్లో తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులు సౌకర్యవంతంగా చదువుకునేలా, వారి సమగ్ర అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అఖిలేష్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల జిల్లా కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాళ్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా నగర్ లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

నారాయణఖేడ్ సందేశం టైమ్స్ ప్రతినిధి అక్టోబర్ 4




నారాయణ్ ఖేడ్ నియోజకవర్గంలోని ఇందిరా నగర్ గ్రామపంచాయతీలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగన్న, పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, కల్?? మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మా???, జ్ఞ????, గోపి సర్, మోతీరా?, న??, తార్ నాయ?, భీ? తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే తమ లక్ష్యమని, స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పారదర్శకంగా రేషన్ పంపిణీ జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేసిన అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషా రెడ్డి

అక్టోబర్ 04(సందేశం టైమ్స్ తెలంగాణ )

**అందోల్ నియోజకవర్గం అల్లాదుర్గ్ మండల్ సీతానగర్ గ్రామంలో**

తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరేలా చూడడమే తమ ప్రధాన లక్ష్యమని అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషా రెడ్డి అన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ గారి ఆదేశానుసారం అల్లాదుర్గ్ మండల పరిధిలోని సీతానగర్ కు సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నా అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



కొప్పుల శేషా రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు కొప్పుల శేషారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి మాట్లాడుతూ...గతంలో రేషన్ కార్డులు లేక అనేక మంది అర్హులైన పేద ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్నదని తెలిపారు. నిరుపేదలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందేందుకు ఈ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఊరా నిర్మల, మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్,సర్పంచ్ శోభ, వార్డ్ మెంబర్లు నాగయ్య, చేందర్, వేంకట్, డీలర్ బెతయ్య, కార్యకర్తలు మరియు ఆయా గ్రామాల ప్రజలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# రెండవసారి రేగోడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎస్. దిగంబర్ రావ్ పాటిల్



రేగోడ్, అక్టోబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి)

మెదక్ జిల్లా లో రెండవసారి రేగోడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన శ్రీ ఎస్. దిగంబర్ రావ్ పాటిల్‌కు మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వినోద్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని, ప్రజలకు మరింత సేవలందిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దిగంబర్ రావ్ పాటిల్‌కు అభినందనలు తెలియజేశారు.

# షీ టీమ్ ఆధ్వర్యంలో బాలల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన

మానూర్, అక్టోబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం సంగారెడ్డి జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, సీఐ శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ డివిజన్ షీ టీమ్ ఇన్‌చార్జి ఏఎస్ఐ తులసిరాం విద్యార్థులకు మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం షీ టీమ్ నిరంతరం పనిచేస్తోందని, మహిళల హక్కులు, బాలల రక్షణ చట్టాలు, పని ప్రదేశాల్లో వేధింపులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఫేక్ ఖాతాలు, ఆన్‌లైన్ మోసాలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, సైబర్ వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, సైబర్ నేరాల కోసం 1930, బాలల సహాయం కోసం 1098, సంగారెడ్డి షీ టీమ్ కోసం 8712656772 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీమ్ కానిస్టేబుల్ చాంగుబాయి, మహిళా పోలీస్ సిబ్బంది లత, బాలల సంక్షేమ కమిటీ శాఖకు చెందిన నర్సిములు, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసన్న,




కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. మహిళలు, బాలల భద్రతతో పాటు సైబర్ నేరాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంచడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

10

# అమూల్ ప్రారంభోత్సవానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు

మెదక్, అక్టోబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

మెదక్ జిల్లా బ్రాహ్మణపల్లిలో అమూల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జాతీయ, రాష్ట్రస్థాయి ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ బ్రాహ్మణపల్లిలోని కార్యక్రమ ప్రాంగణాన్ని పరిశీలించారు. ప్రముఖుల రాకపోకలు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, బందోబస్తు విధులు తదితర ఏర్పాట్లను పరిశీలించి పోలీసు అధికారులతో సమీక్షించారు. వీఐపీల రాక



సందర్భంగా ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. బందోబస్తులో విధులు నిర్వహించే సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. జాతీయ, రాష్ట్రస్థాయి ప్రముఖులు హాజరయ్యే నేపథ్యంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంట అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్రబోస్, సీఐలు వెంకట రాజా గౌడ్, సందీప్ రెడ్డి, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ తదితర పోలీసు సిబ్బంది ఉన్నారు.

# చిట్టీలు, అధిక రాబడి పేరుతో కోట్ల రూపాయలు వసూళ్లు.. ఇద్దరు అరెస్ట్

**చివ్వెంల, అక్టోబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి సోమయ్య కంభంపాటి):**
చివ్వెంల పోలీస్ స్టేషన్ పరిధిలో చిట్టీలు, డెయిలీ కలెక్షన్లు, అధిక రాబడుల పేరుతో ప్రజల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి మోసానికి పాల్పడిన కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు, అతని భార్యను చివ్వెంల పోలీసులు అరెస్ట్ చేశారు. సూర్యాపేట డివిజన్ డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ప్రసన్న కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చివ్వెంల మండలం యెనగండి తండాకు చెందిన బానోత్ రాజు (44) ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ తన భార్య బానోతు అనూష (33) సహకారంతో 2015 నుంచి డెయిలీ కలెక్షన్లు, చిట్టీల వ్యాపారం నిర్వహించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అధిక రాబడులు, నెలవారీ చెల్లింపులు ఇస్తామని నమ్మించి ప్రజలు, తోటి ఉద్యోగులు, పరిచయస్తుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు సేకరించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే భూములు కొనుగోలు




చేస్తున్నట్లు నమ్మించి పలువురి నుంచి నగదు తీసుకున్నట్లు, చిట్టీల గడువు పూర్తైనప్పటికీ డబ్బులు తిరిగి చెల్లించకుండా మోసం చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. సేకరించిన మొత్తంలో కొంత భాగాన్ని వ్యక్తిగత అవసరాలు, ఆస్తుల కొనుగోలుకు వినియోగించగా, మిగిలిన మొత్తాన్ని సుమారు 500 నుంచి 600 మందికి రూ.10 వేల నుంచి రూ.2 లక్షల వరకు నెలకు 10 శాతం వరకు అధిక వడ్డీకి అప్పుగా ఇచ్చినట్లు గుర్తించామని డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు. ఇప్పటివరకు జరిగిన దర్యాప్తులో బాధితుల నుంచి రూ.6,24,50,000 సేకరించినట్లు, అందులో రూ.3,18,54,000 తిరిగి చెల్లించినట్లు, ఇంకా రూ.3,05,96,000 బకాయిలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి స్వీకరించిన మొత్తాలు, తిరిగి చెల్లింపులు, ప్రామిసరీ నోట్లు, చెక్కులు, బాండ్లు, భూముల లావాదేవీలకు సంబంధించిన అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. అరెస్టయిన వారిలో బానోత్ రాజు (44), ప్రభుత్వ ఉపాధ్యాయుడు, బానోతు అనూష (33), గృహిణి ఉన్నారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బానోత్ రాజు, బానోతు అనూష చేతిలో మోసపోయిన ఇతర బాధితులు ఎవరైనా ఉంటే తమ వద్ద ఉన్న ఆధారాలతో వెంటనే చివ్వెంల పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు. అధిక రాబడులు, చిట్టీలు, పెట్టుబడుల పేరుతో ప్రజలను మోసగించేందుకు ప్రయత్నించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రసన్న కుమార్ హెచ్చరించారు. కేసు దర్యాప్తులో కీలకంగా పనిచేసిన సూర్యాపేట రూరల్ సీఐ జి. రాజశేఖర్, ఎస్ఐలు వి. మహేశ్వర్, వెంకన్నతో పాటు సిబ్బంది జనార్దన్ రెడ్డి, వెంకటేష్‌లను అధికారులు అభినందించారు.

# సంగారెడ్డి జిల్లా వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు: కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి సందేశం టైమ్స్ ప్రతినిధి అక్టోబర్ 4**



సంగారెడ్డి జిల్లాలోని వసతి గృహాలలో మౌలిక వసతులు కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ప్రతీక్ జైన్ శనివారం కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో తెలిపారు. జూ= నిధులతో వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని, ఈ కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి అఖిలే? రెడ్డి, బీసీ అభివృద్ధి అధికారి జగదీష్ పాల్గొన్నట్లు ఆయన అధికారులను ఆదేశించారు.

# బ్యాడ్మింటన్ కోర్టులో దుమ్మురేపిన సంగారెడ్డి పోలీసులు.. అభినందించిన ఎస్పీ పారితోష్ పంకజ్!

**సంగారెడ్డి జిల్లా సందేశం టైమ్స్ ప్రతినిధి అక్టోబర్ 4**



పతకాలతో మెరిసిన సంగారెడ్డి పోలీసులు: 5వ తెలంగాణ బ్యాడ్మింటన్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా పోలీసు సిబ్బంది సత్తా చాటారు. హెడ్ కానిస్టేబుల్ ఈ.డి. సజీవ్ 50౦ విభాగంలో స్వర్ణ పతకం సాధించగా, మహిళల ఓపెన్ డబుల్స్‌లో శ్రావ్య, ధరణి కాంస్య పతకం గెలుచుకున్నారు. ఈ విజేతలను ఎస్పీ పంకజ్, ఐపీఎస్ సన్మానించి అభినందించారు.

# యుద్ధం మానవజాతిని నాశనం చేస్తుంది.. శాంతి కోసం పోరాడాలి

**సూర్యాపేట, అక్టోబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి సోమయ్య కంభంపాటి):**
యుద్ధం వల్ల మానవాళికి అంతులేని నష్టం జరుగుతుందని, ప్రాణనష్టంతో పాటు భవిష్యత్ తరాలు తీవ్రంగా దెబ్బతింటాయని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది కె.వి.ఎల్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బ్రహ్మాండపల్లి ప్రభాకర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సంఘం జిల్లా నాలుగో మహాసభలో ఆయన మాట్లాడుతూ వ్యక్తుల ఆలోచనా విధానాల నుంచే శాంతి లేదా యుద్ధం ఉద్భవిస్తాయని, చెడు ఆలోచనలు ప్రపంచాన్ని విభజిస్తాయని అన్నారు. అమెరికా వంటి దేశాలు సామ్రాజ్యవాద ధోరణులతో చిన్న దేశాలపై ఆధిపత్యం సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయని, తమ వ్యాపార ప్రయోజనాల కోసం కొన్ని యూరప్ దేశాలు కూడా అమెరికాకు మద్దతు ఇస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఇరాన్‌పై జరిగిన యుద్ధం కారణంగా వేలాది మంది గాయపడటం, చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం, ప్రజలు ఆహారం, నిత్యావసర మందుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. యుద్ధం మానవాళికి మేలు చేయదని, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, శాంతి కోసం ప్రజలు గొంతు విప్పాలని పిలుపునిచ్చారు. “యుద్ధం వద్దు.. శాంతి ముద్దు” అనే నినాదంతో పాటు ఉగ్రవాదం, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. మౌనంగా ఉండటం వల్ల సమాజానికి ప్రయోజనం ఉండదని, నిరుద్యోగం, నిరక్షరాస్యత, దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలు చైతన్యంతో పోరాడాలని సూచించారు. శాంతియుతంగా జీవిస్తూ ప్రగతివైపు పయనించాలని కోరారు. మహాసభకు ముందు జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం మహాసభ అధ్యక్షులు తోగిటి మురళి, బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్ కుమార్, పుట్టపాక అంజయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ సమత, వై.



వెంకటేశ్వర్లు, మందారి డేవిడ్ కుమార్, గుడిపూడి వెంకటేశ్వరరావు, తలమల్ల హస్సేన్, నాతి సవేంద్ర కుమార్, బొమ్మిడి లక్ష్మీనారాయణ, అనంతుల మల్లేశ్వరి, బూర వెంకటేశ్వర్లు, గుగులోతు రాజారాం, ఖమ్మంపాటి రాము, దంతాల రాంబాబు, ఎడెల్లి శ్రీకాంత్, గొద్దలి నరసయ్య, తాళ్లపల్లి సత్యనారాయణ, దూలం నగేష్, దికొండ శ్రీనివాస్, పొన్నం రమేష్, గాలి రామకృష్ణ, నాతి లీలావతి, భూపాల్, బత్తుల నరసయ్య, సారెడ్డి వెంకటరెడ్డి, చిలక రాజు శ్రీను, దాయం ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వాగ్దేవి కళాశాలకు గర్వకారణం.. రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు వంశీ ఎంపిక

**నారాయణఖేడ్, అక్టోబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
నారాయణఖేడ్‌లోని వాగ్దేవి (జనరల్ ఢ వొకేషనల్) జూనియర్ కళాశాలకు చెందిన ఎం.పి.సి ద్వితీయ సంవత్సరం విద్యార్థి వి. వంశీ అండర్--19 కబడ్డీ విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికై కళాశాలకు గర్వకారణంగా నిలిచాడు. తన ప్రతిభ, కృషి, పట్టుదలతో రాష్ట్ర స్థాయి జట్టులో చోటు సంపాదించిన వంశీని కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ వంశీ అద్భుత ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయికి ఎదిగి కళాశాలకు, తల్లిదండ్రులకు, నారాయణఖేడ్ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వంశీకి కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.



# ఆందోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ మండల, టౌన్ అధ్యక్షుల నియామకం





**ఆందోల్, అక్టోబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచనల మేరకు ఆందోల్ నియోజకవర్గంలోని వివిధ మండలాలు, ఆందోల్--జోగిపేట టౌన్ కాంగ్రెస్ పార్టీకి నూతన అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆందోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా గంగాధర్ అశోక్, మునిపల్లి మండల అధ్యక్షులుగా లింగన్నగారి సతీష్ కుమార్, చౌటకూరు మండల అధ్యక్షులుగా బోడపట్ల గణేష్, పుల్కల్ మండల అధ్యక్షులుగా మల్లన్నగారి దుర్గారెడ్డి, రాయకోడు మండల అధ్యక్షులుగా పట్లోళ్ల కేదారినాథ్, వట్పల్లి మండల అధ్యక్షులుగా వజినాల విశ్వాస్, ఆందోల్--జోగిపేట టౌన్ అధ్యక్షులుగా డి.జి. వెంకటేశం, రేగోడు మండల అధ్యక్షులుగా ఎస్. దిగంబర రావు, అల్లాదుర్గ్ మండల అధ్యక్షులుగా కొప్పుల శేషారెడ్డి, టేక్మాల్ మండల అధ్యక్షులుగా పట్లోళ్ల విష్ణువర్ధన్ రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన మండల, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డిలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా సమావేశమై వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం తదితర అంశాలపై చర్చించారు.

# వట్ పల్లిలో కుక్కల సైబర్ విహారం: భయాందోళనలో ప్రజలు

**సంగారెడ్డి జిల్లా సందేశం టైమ్స్ ప్రతినిధి అక్టోబర్ 4**
వట్ పల్లి మండల కేంద్రంలో పదుల సంఖ్యలో కుక్కలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. 1వ వార్డు సభ్యులు పల్లె బాలాజీ రావు, గ్రామ సభలో కార్యదర్శి, సర్పంచ్‌లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో చిన్న పిల్లలను పాఠశాలకు పంపాలన్నా, బయట ఆడుకోవడానికి పంపాలన్నా తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఈ సమస్యకు అధికారులు వెంటనే పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. --- సందేశం టైమ్స్ ప్రతినిధి



# పోషకాహారం, పరిశుభ్రతతోనే రక్తహీనతకు దూరంగా సుఖ ప్రసవం

ఖమ్మం, సెప్టెంబర్ 4 (సందేశం టైమ్స్ జిల్లా ఇన్‌చార్జ్ శెట్టి సురేష్):
పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా గర్భిణీలు రక్తహీనత సమస్యలకు దూరంగా ఉండి సుఖ ప్రసవం పొందవచ్చని జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల అన్నారు. ఖమ్మం రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ చావ కమల ప్రియ ఆధ్వర్యంలో చింతకాని మండలం లచ్చగూడెం రైతు వేదికలో నిర్వహించిన 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తల్లి, బిడ్డల సంక్షేమమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోషకాహార లోపం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున గర్భం నిర్ధారణ అయిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకుని ప్రభుత్వం అందిస్తున్న పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని, అంగన్‌వాడీ టీచర్లు అందించే సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అందించే వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు రెండేళ్ల వయస్సు వచ్చే వరకు ఉండే సుమారు 1000 రోజుల కాలాన్ని బంగారు రోజులుగా పరిగణిస్తామని, ఈ సమయంలో శిశువు శారీరకంగా,



మానసికంగా వేగంగా అభివృద్ధి చెందుతాడని వివరించారు. సీడీపీఓ కమల ప్రియ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను అంగన్‌వాడీ టీచర్లు స్వయంగా శుభ్రంగా, రుచికరంగా తయారు చేసి ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. తహసీల్దార్ కరుణ శ్రీ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రశంసించారు. చిన్నారులకు ఆటపాటలతో క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన అందిస్తూ బాల్యారంభ దశను బంగారు బాటలో నడిపిస్తున్నారని అన్నారు. ఆర్బీఎస్‌కే జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శ్రీకాంత్, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వీవీ రావు మాట్లాడుతూ ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ సమన్వయంతో తల్లి, బిడ్డల సంక్షేమం కోసం పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నందున గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. లచ్చగూడెం సర్పంచ్ కొప్పుల రజిని, వందనం గ్రామ సర్పంచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళా, శిశు సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం అందించడంతో పాటు చిన్నారులకు విద్యాబోధన అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. చిన్నారులను దూర ప్రాంతాల్లోని ప్రైవేట్ పాఠశాలలకు ఆటోలు, వ్యాన్ల ద్వారా పంపకుండా స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. ఐసీపీఎస్ జిల్లా కోఆర్డినేటర్ తమ్రిన్ మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం గర్భిణీలకు సాంప్రదాయ పద్ధతిలో చీర, సారె, పూలు, పండ్లు, చలిమిడి, బొట్టు, గాజులతో వడినింపి కుటుంబ సభ్యుల సమక్షంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. అలాగే అన్నప్రాసనలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో చింతకాని సెక్టార్ సూపర్‌వైజర్ సంధ్యారాణి, నాగులవంచ సెక్టార్ సూపర్‌వైజర్ సత్యవతి, పోషణ అభియాన్ బాధ్యులు కొమ్మినేని బాబు, షామిలి, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు భద్రత కోసం ముళ్ల పొదల తొలగింపు

వట్పల్లి మండల్ అక్టోబర్ 4 సందేశం టైమ్స్ ప్రతినిధి



సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం పరిధిలో ని గొర్రెకల్ గ్రామపంచాయతీ పరిధిలోని నాగులపల్లి గ్రామ శివారు సరిహద్దు నుంచి వట్టిపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు, ముళ్ల పొదలను తొలగించే కార్యక్రమాన్ని గొర్రెకల్ గ్రామ సర్పంచ్ తిరుపతి లింగారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. రహదారిలోని మూలమలుపుల వద్ద ముళ్ల పొదలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు రోడ్డు ప్రయాణికులకు సక్రమంగా కనిపించక గతంలో పలుమార్లు ప్రమాదాలు జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలో వాహనదారులకు మెరుగైన దృశ్యమానత కల్పించి, రోడ్డు ప్రమాదాలను నివారించాలనే ఉద్దేశంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలు, చెట్ల కొమ్మలను తొలగించే పనులను చేపట్టినట్లు సర్పంచ్ తిరుపతి లింగారెడ్డి తెలిపారు. రహదారి భద్రత కోసం ఈ చర్యలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు

## కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసిన హరీశ్‌రావు

మెదక్, అక్టోబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి):



మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం కాగజ్ మద్దూరు గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తెలంగాణలో రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా గ్రామాల అభివృద్ధిపై తగిన దృష్టి పెట్టడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో భారీ ప్రాజెక్టులకు వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, గ్రామాల్లో ప్రజలకు అవసరమైన రోడ్లు, మౌలిక వసతుల కల్పనలో విఫలమైందని ఆయన విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీలో చేరిన నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## నారాయణఖేడ్ ఏరియా ఆసుపత్రిని పరిశీలించిన డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్

నారాయణఖేడ్, అక్టోబర్ 4(సందేశం టైమ్స్ ప్రతినిధి):



నారాయణఖేడ్ ఏరియా ఆసుపత్రిని డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్ శనివారం సందర్శించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలు, రోగుల వార్డులు, ప్రయోగశాల, మందుల విభాగం, రోగులకు అందిస్తున్న ఆహారం, సిబ్బంది హాజరు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలు, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై వైద్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్వహణ తీరుపై డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మరింత మెరుగుపరచాలని తెలిపారు. ఆసుపత్రిని మరోసారి సందర్శించి వైద్య సేవల పరిస్థితిని పరిశీలిస్తానని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఆర్ఎంఓ డాక్టర్ వికాస్, డాక్టర్ శ్రీకాంత్, ఫార్మసిస్ట్, ప్రయోగశాల సాంకేతిక నిపుణుడు, నర్సింగ్ సిబ్బంది, సూపరింటెండెంట్‌తో పాటు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## చౌటకుర్ మండల్ గ్రామం కొర్పల్ సేవా సంకల్ప అభియాన్ [ నరేంద్ర మోడీ గౌరవ భారత ప్రధాని జన్మదిన సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా]

సంగారెడ్డి /అక్టోబర్/04 సందేశం టైమ్స్



అంగన్ క సేవ అనే కార్యక్రమంలో భాగంగా - ఈరోజు కోర్పోలు గ్రామంలో ఉన్న నాలుగు అంగన్వాడి కేంద్రాలను పరిశీలించి వాటిలో ఉన్న చిన్నారులతో ముచ్చటించి , మిఠాయిలు పంచుకొని , ఒకటి నుంచి వెయ్యి రోజుల వరకు ఒక శిశువు ఎదుగుదలలో ఎంతో తోడ్పడుతూ , వారికి సేవలు చేస్తున్న ఆయాలకు విద్యాబుద్ధులు నేర్పుతున్న అంగన్వాడి టీచర్లకు వారి సేవలను కొనియాడుతూ కోర్పోల్ గ్రామ బిజెపి నాయకులు వారిని శాలువాలతో సత్కరించడం జరిగింది, ఈ కార్యక్రమంలో మండల జనరల్ సెక్రెటరీ పుట్టి మోహన్ ముదిరాజ్, జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు సారా రాజ్ కుమార్, సీనియర్ బిజెపి నాయకులు చందాపురం రమేష్, బీజేవైఎం సభ్యులు ప్రవీణ్ రెడ్డి బచ్చుగూడెం పాల్గొన్నారు, ఈ సందర్భంగా గత మాన్ కి బాత్ లో మోడీ గారు తమ అంగన్వాడీల గురించి మాట్లాడడం వారి జన్మదిన సందర్భంగా పార్టీ నాయకత్వం మమ్మల్ని గుర్తించడం శాలువాలతో సత్కరించడం చాలా సంతోషంగా ఉందని అంగన్వాడీ ఉపాధ్యాయులు ఆయాలు తెలియచేయడం జరిగింది.

## శ్రీధరచారి మాతృమూర్తి మృతికి మఠం భిక్షపతి నివాళులు

మెదక్, అక్టోబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి):



టేక్మాల్ మండల సీనియర్ నాయకులు శ్రీధరచారి మాతృమూర్తి మృతి చెందడంతో తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి వారి నివాసానికి చేరుకుని మృతురాలి భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం శ్రీధరచారితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మఠం భిక్షపతితో పాటు పలువురు మండల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని మృతురాలికి నివాళులు అర్పించారు

## ఆరుద్రాష్టమి వ్రతంలో పాల్గొన్న జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి

మెదక్, అక్టోబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి):



సంగారెడ్డి జిల్లా ఫసల్‌వాడిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో పీఠాధిపతి మహేశ్వరశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో ఆరుద్రాష్టమి వ్రతాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆరుద్రాష్టమి సందర్భంగా సుమారు 2,700 మంది మహిళలతో సామూహిక వ్రతాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## మంజీరాన్ని జీవనదిగా మార్చాం: హరీశ్‌రావు

మెదక్ సందేశం టైమ్స్ ప్రతినిధి అక్టోబర్ 4

మెదక్: తెలంగాణ ఏర్పడక ముందు మంజీరా నది జిల్లాలో ఉన్నా నీటిని వినియోగించుకునే హక్కు లేకుండా పోయిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంజీరాపై చెక్‌డ్యామ్‌లు నిర్మించకూడదనే నిర్ణయాలు ఉండేవని




ఆయన తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో చెక్‌డ్యామ్‌లు నిర్మించి మంజీరాన్ని జీవనదిగా మార్చామని పేర్కొన్నారు. దీంతో మెదక్ జిల్లా అభివృద్ధి చెందిందని ఆయన వివరించారు.

